సాక్షి అనకాపల్లి
గురువారం । 7 । ఆగస్టు । 2025



బల్క్‌డ్రగ్ పార్క్ వద్దంటూ నినాదాలు చేస్తున్న మత్స్యకారులు, (ఇన్‌సెట్) బారికేడ్లు దాటుకుని వేదిక వద్దకు వస్తున్న వైస్ ఎంపీపీ నానాజీ

రణరంగం

- బల్క్‌డ్రగ్ పార్కుపై ప్రజాభిప్రాయ 'సేక'రణం'
- వ్యతిరేకుల నోరు నొక్కేందుకు తీవ్ర యత్నాలు
- అడుగడుగునా పోలీసుల మోహరింపు
- ముందస్తు అరెస్టులపై మండి పడ్డ గంగపుత్రులు
- అడ్డంకులను దాటుకొని సభలో పాల్గొన్న బాధితులు
- చావనైనా చస్తాం గానీ బల్క్‌డ్రగ్ ఏర్పాటు చేయనివ్వబోమని శపథం

బల్క్‌డ్రగ్ పార్కుపై ప్రజాభిప్రాయ సేకరణ రణరంగాన్ని తలపించింది. చావనైనా చస్తాం, బల్క్‌డ్రగ్ ఏర్పాటు చేయనివ్వబోమని రైతులు, మత్స్యకారులు స్పష్టం చేశారు. వారి వ్యతిరేకతను ముందే గ్రహించిన ప్రభుత్వం గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. నిర్వాసితులు ఎవరూ వేదిక వద్దకు రాకుండా శతవిధాలా ప్రయత్నించారు. గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులతోపాటు ఎక్కడికక్కడ అడ్డుకున్నా బల్క్‌డ్రగ్ పార్కు ప్రభావిత ప్రాంత ప్రజలు పోరాడి తమ హక్కును సాధించుకున్నారు. తమ వ్యతిరేక వాణిని వినిపించారు.

నక్కపల్లి:

రాత్రికి రాత్రి 500 మంది పోలీసులను దించారు. బుధవారం తెలతెలవారుతుండగానే వైఎస్సార్‌సీపీ, సీపీఎం, రైతు నాయకులు వీసం రామకృష్ణ, గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందరావు, ఎం.అప్పలరాజు, ఎం.రాజేష్, తళ్ల భార్గవ్‌లను గృహ నిర్బంధం చేశారు. మత్స్యకార గ్రామాల నుంచి నిరసన తెలిపేందుకు ఎవరూ రాకుండా ముందు రోజు రాత్రే పోలీసులు కవాతు నిర్వహించి ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించారు. అయినప్పటికీ రాజయ్యపేట, గుడివాడ, గుర్రాజుపేట, పెదతీనార్ల, చినతీనార్ల, జానకయ్యపేట గ్రామాల నుంచి వచ్చిన వారిని వందలాది మంది పోలీసులు జాతీయరహదారిపై బారికేడ్లు పెట్టి వేదిక వద్దకు రాకుండా అడ్డుకున్నారు. బారికేడ్లను తోసుకుంటూ వారు వేదిక వద్దకు రావడానికి ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. తమ ఆవేదన, అభ్యంతరాలను తెలుపుకునేందుకు అవకాశమివ్వని అధికారుల అవకాశవాదంపై బాధితులు ఆగ్రహం చెందారు. తాము ఎమ్మెల్యేగా గెలిపించిన హోం మంత్రి అనిత ఫ్లెక్సీని చెప్పుతో కొట్టారు.

వాణి వినిపించారు..

చావనైనా చస్తాం కానీ.. రాజయ్యపేట సమీపంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ఒప్పుకోబోమని మండలంలో పలు గ్రామాలకు చెందిన మత్స్యకారులు, బాధిత గ్రామ ప్రజలు స్పష్టం చేశారు. రాజయ్యపేట సమీపంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 1270 ఎకరాల్లో రూ.1257 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బల్క్‌డ్రగ్ పార్క్‌పై తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వారు తమ వాణి వినిపించారు. సభకు నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ అధ్యక్షత వహించారు. పోలీసుల అడ్డంకులను దాటుకొని వేదిక ప్రాంగణానికి చేరుకున్న ఆందోళకారులంతా రెండు బృందాలుగా విడిపోయారు. కొంతమంది వేదిక గేటు ముందు, కొంతమంది తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. కూటమి ప్రభుత్వం, చంద్రబాబు, పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితలపై ఆగ్రహంతో శాపనార్థాలు పెట్టారు. 2014లో చంద్రబాబు ప్రజల భూముల జోలికి వచ్చిన అధికారులను చెట్లకు కట్టికొట్టాలని పిలుపు నిచ్చారని, అదే చంద్రబాబు ఇప్పుడు భూములు లాక్కొని ప్రజల ప్రాణాలు తీసే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు ఉద్యోగాలిస్తామని చెప్పారు కానీ ఇవ్వరన్నారు. ఇతర ప్రాంతాల్లో వ్యతిరేకించిన పరిశ్రమలను నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులకే మాట్లాడే అవకాశం ఇస్తున్నారని ఆక్షేపించారు. కంపెనీలకు అనుకూలంగా టీడీపీ నాయకులు మాట్లాడుతున్న సమయంలో ఆందోళనకారులు అరుపులు కేకలతో అడ్డు తగిలారు. తమకు కూడా మాట్లాడే అవకాశం కల్పించాలంటూ వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, నాయకులు గొర్ల బాబూరావు తదితరులు బారికేడ్లు తోసుకుంటూ వేదిక ముందుకు వచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెనక్కినెట్టేశారు. దీంతో ఆందోళనకారులు వేదిక వద్దకు దూసుకు వచ్చేందుకు ప్రయత్నించడంతో అధికారులు గత్యంతరం లేక వారికి కూడా మాట్లాడే అవకాశం కల్పించారు. సభలో పాల్గొనేందుకు విశాఖ నుంచి వచ్చిన సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు లోకనాథంను అరెస్టు చేసి అనకాపల్లి తరలించారు.



మత్స్యకారులకు, పోలీసులకు మధ్య తోపులాట



ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తున్న అధికారులు



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన మత్స్యకారులు



వీసం రామకృష్ణను అరెస్టు చేసిన పోలీసులు

డిప్యూటీ సీఎంకు ఇది తగదు

పవన్ కల్యాణ్‌కు మత్స్యకారుల గోడు పట్టడం లేదని ఆందోళనకారులు మండిపడ్డారు. బల్క్‌డ్రగ్ పార్కు కాకినాడ జిల్లాలో ఏర్పాటు చేస్తామంటే వద్దని తొండంగిలో ధర్నా చేశారని, నక్కపల్లిలో ఎందుకు చేయడం లేదంటూ నిలదీశారు. రాజయ్యపేటలో హోం మంత్రి అనితకు 2 వేల ఓట్ల మెజార్టీ ఇచ్చామని, అందుకు తగిన బహుమతి ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు గ్రామంలో ఆమె ఎలా అడుగుపెడతారో చూస్తామని హెచ్చరించారు. రాజయ్యపేటకు చెందిన కొంతమంది కార్యకర్తలు కంపెనీలకు అనుకూలంగా మాట్లాడే ప్రయత్నం చేయడంతో వారికి నిరసనకారులు దేహశుద్ధి చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులు తిరిగి వెళ్లకుండా వాహనాలకు అడ్డంగా బైఠాయించారు. సీఐలు కుమారస్వామి, రామకృష్ణలు నచ్చజెప్పి పంపించేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్థానిక ఉద్యోగం.. పక్కా మోసం



స్థానికులకు ఉద్యోగాలు అనేది పక్కా మోసం. నేను,హెటిరోలో ఉద్యోగం కోసం వెళ్తే స్థానికుడనని ఇవ్వలేదు. శత్రు దేశాలతో యుద్ధం చేసినప్పుడు భయపడలేదు. కానీ ఇక్కడ కంపెనీలు పెడుతున్నారంటే భయం వేస్తోంది.

–బాలు, మాజీ సైనికోద్యోగి, ఉపమాక

ఈ ప్రాంతీయులంటే అంత చులకనా?



బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటయితే ఈ ప్రాంతంలో మరణ మృదంగం వినిపిస్తుంది. ప్రజలు సుఖంగా జీవించే పరిస్థితి ఉండదు. కాకినాడ జిల్లాలో వ్యతిరేకించిన కంపెనీని ఇక్కడ ఎలా పెడతారు. ఈ ప్రాంతీయుల ప్రాణాలంటే అంత చులకనా?

– వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు

జెట్టీ నిర్మించండి



మాకు ఈ బల్క్‌డ్రగ్ వద్దు. మా ప్రాణాలు ముఖ్యం. గత ప్రభుత్వంలో 24 కోట్లతో మంజూరు చేసిన జెట్టీ నిర్మించండి చాలు. ఏదోలా బతుకుతాం. కొత్త కంపెనీలు పెట్టి మా ప్రాణాలు తీయొద్దు. మీకు దణ్ణం పెడతాం.

–పిక్కి సత్తియ్య, ఎంపీటీసీ (టీడీపీ), రాజయ్యపేట

అమరావతిలో పెట్టొచ్చు కదా



ఇప్పటికే పలు కంపెనీలతో అనేక రోగాలు వచ్చి బాధ పడుతున్నాం. బల్క్‌డ్రగ్ పార్కు ఇక్కడే ఎందుకు.. అమరావతిలో పెట్టొచ్చు కదా? ఈ కంపెనీ పెడితే రైతులంతా ఉరేసుకుని చావాల్సిందే. ఏమీ మిగలదు.

–డీవీఎస్ఎన్ రాజు, రైతు, పెదతీనార్ల

భవిష్యత్ అంధకారమే



మా కుటుంబానికి చెందిన 79 ఎకరాల భూమిని తీసుకుంటున్నారు. ఏపీఐఐసీ ప్రకటించిన అధ్యయన నివేదిక తప్పుల తడక. అత్యంత ప్రమాదకరమైన 30 కంపెనీలు ఇక్కడ ఏర్పాటు చేస్తారు. భవిష్యత్ అంతా అంధకారమే.

–మహదేవ్ ఉపాధ్యాయుల, గుర్రాజుపేట, ఎస్.రాయవరం మండలం

ప్రాణాంతకం



మాకు 3 ఎకరాల భూమి ఉంది. మొత్తం తీసేసుకుంటున్నారు. అభిప్రాయం చెప్పడానికి వస్తే పోలీసులు అడ్డుకున్నారు. కంపెనీ ఏర్పాటు చేస్తే 50 ఏళ్లకు చనిపోయేవారు 20 ఏళ్లకే చనిపోతారు. పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాం.

–దాట్ల ఉమాదేవి, మహిళా రైతు, గుర్రాజుపేట

ప్రజారోగ్యానికి హాని



ప్రజలు వ్యతిరేకించే పరిశ్రమను ఏర్పాటు చేయడం తగదు. నిర్వాసితులకు ఇంకా పూర్తిగా నష్టపరిహారం చెల్లించలేదు. ఆరోగ్యానికి హాని కలిగించే పరిశ్రమలు ఏర్పాటు చేయడం మంచిది కాదు. అభిప్రాయాలు చెప్పేందుకు వచ్చే వారిని పోలీసులు అడ్డుకోవడం దారుణం.

–కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్యే

రాజ్యాంగ హక్కును కాలరాస్తున్నారు



తమ గోడు చెప్పుకునేందుకు వచ్చే వారిని నిర్బంధించడం సరికాదు. వేదిక వద్దకు వెళ్లకుండానే ముందుగా అరెస్టు చేయడం రాజ్యాంగ హక్కును కాలరాయడమే. ప్రశ్నించే వారిని బెదిరించి అనుకూలంగా మలచుకోవాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది.

–కె.లోకనాథం, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

రెడ్‌బుక్ రాజ్యాంగం



మత్స్యకారులకు అండగా నిలబడ్డామన్న అక్కసుతో ముందుగానే గృహ నిర్బంధం చేసి అరెస్టు చేశారు. ప్రశ్నించే గొంతు నొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు.

–వీసం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత

అంగీకరించే ప్రసక్తి లేదు



రైతులు భూములు ఇవ్వమని చెప్తే టీడీపీకి చెందిన కొంతమంది భూస్వాముల దగ్గర భూములు తీసుకుని మిగిలిన వారిని బెదిరించి లాక్కున్నారు. ఈ పార్క్ ఏర్పాటును అంగీకరించే ప్రసక్తి లేదు. ఎటువంటి కేసులకైనా సిద్ధం.

గొర్ల బాబూరావు, రైతు నాయకుడు

విష వాయువులు ముంచేస్తాయి



మా ఊరికి సమీపంలో ఉన్న కంపెనీ నుంచి వచ్చే విష వాయువుల వల్ల మా సర్పంచ్ కొడుకు క్యాన్సర్ వచ్చి చనిపోయాడు. మళ్లీ అటువంటి కంపెనీలు పెడితే సహించేది లేదు. పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తాం.

–పిక్కి స్వామి, జనసేన నాయకుడు

మేము అనుకూలం



బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు మేము అనుకూలం. రైతులకు, మత్స్యకారులకు నష్టం లేకుండా చూస్తాం. అభివృద్ధి జరగాలంటే కంపెనీలు రావాల్సిందే.

–కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ ఇన్‌చార్జ్

న్యూస్‌రీల్

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- వైఎస్సార్ సీపీ జోన్–1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనురాధ



సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆ పార్టీ జోన్–1(ఉత్తరాంధ్ర జిల్లాల) మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఈర్లె అనురాధ అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈర్లె అనురాధను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీనైన తనకు వైఎస్సార్ సీపీలో వివిధ పదవులు కల్పించారని చెప్పారు. తనపై నమ్మకంతో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన పదవికి తగిన న్యాయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ నుంచి కె.కోటపాడు జెడ్పీటీసీగా గెలిచిన అనురాధ.. పార్టీలో అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా, మాడుగుల నియోజకవర్గం సమన్వయకర్తగా, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం ఆమె ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

మెరైన్ పోలీస్ స్టేషన్ల పటిష్టతకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్



తీర ప్రాంత రక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: తీర ప్రాంత రక్షణకు, మెరైన్ పోలీస్ స్టేషన్ల పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి తీర ప్రాంత రక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెరైన్ పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్లకు ప్రహరీలు, మరుగుదొడ్లు, బెంచీలు నిర్మించడంతో పాటు లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. బోట్లకు మరమ్మతులు చేయించడంతో పాటు, సీసీ కెమెరా ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యాటకులు ఎక్కువగా వచ్చే రోజుల్లో గజ ఈతగాళ్లను తీర ప్రాంతంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెరైన్ పోలీస్ స్టేషన్ల అధికారులు, మత్స్య,పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు జనపాల అప్పలనాయుడు భార్య సత్యవతికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: నర్సీపట్నం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు జనపాల అప్పలనాయుడు కుటుంబానికి బుధవారం ఎస్పీ తుహిన్ సిన్హా ఆర్థిక సాయం అందజేశారు. హోంగార్డుల ఒక రోజు వేతనం నుంచి రూ. 3,78,430 చెక్కును మృతుడు భార్య సత్యవతికి తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధుల నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించడం అభినందనీయమన్నారు.


నేడు అచ్యుతాపురంలో జాతీయ చేనేత దినోత్సవం

తుమ్మపాల : స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా 1905లో విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ స్వదేశీ ఉద్యమం ప్రోత్సహించడానికి ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం, స్వదేశీ ఆత్మనిర్భరతకు దోహద పడిన ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ 2015 నుండి ప్రధానమంత్రి 'మై హ్యాండ్ లూమ్ ..మై ప్రైడ్' పేరుతో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించి నిర్వహిస్తున్నారని జిల్లా చేనేత, జౌళి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు అచ్యుతాపురంలో గురువారం నాలుగు రోడ్ల కూడలి నుంచి వీవర్స్ సొసైటీ బిల్డింగ్ వరకు ఉదయం 10 గంటల నుంచి హ్యాండ్లూమ్ వాక్, అచ్యుతాపురం వీవర్స్ సొసైటీ బిల్డింగ్ వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన, సీనియర్ చేనేత వస్త్ర కార్మికులకు సన్మానం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హాజరుకానున్నారని తెలిపారు.

కూటమికి స్టాండింగ్ షాక్!

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి సాడి పద్మారెడ్డి విజయం
- మేయర్‌పై వ్యతిరేకత
- కూటమి పార్టీల్లో లుకలుకలు
- హైకోర్టు కేసు నేపథ్యంలో వేటు భయం
- భారీగా జరిగిన క్రాస్ ఓటింగ్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/డాబాగార్డెన్స్ :



వైఎస్సార్ సీపీ అభ్యర్థి సాడి పద్మారెడ్డి విజయం అనంతరం అభినందనలు తెలుపుతున్న పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

కూటమి పార్టీల్లో రోజురోజుకీ పెరుగుతున్న లుకలుకలు.. మేయర్ వ్యవహారశైలి పట్ల సొంత పార్టీ కార్పొరేటర్లల్లో వ్యతిరేకత.. పార్టీ మారిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలు... వెరసి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సాడి పద్మారెడ్డి ఏకంగా 50 ఓట్లతో విజయం సాధించారు. మొత్తం 10 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలో చేరిన కార్పొరేటర్లతో పాటు కూటమిలోని మరికొందరు కార్పొరేటర్లు కూడా క్రాస్ ఓటింగ్‌కు దిగడంతో కూటమికి షాక్ తగిలింది. గత స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మొత్తం 10 స్థానాల్లో విజయం సాధించిన కూటమికి ఈ దఫా జరిగిన ఎన్నికల్లో ఓ స్థానంలో ఓటమి తప్పలేదు. వాస్తవానికి సాధారణ ఎన్నికల తర్వాత కూటమి పార్టీల్లోకి పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు జంప్ అయ్యారు. ఇక వైఎస్సార్ సీపీకి నికరంగా 32 మంది కార్పొరేటర్లు మిగిలారు. స్థాయీ సంఘం ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న 10 మంది అభ్యర్థులకు 32 కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. దీన్ని బట్టి కూటమి పాలన పట్ల కార్పొరేటర్లలో ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమవుతోంది.

కనీస గౌరవమేదీ..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవీఎంసీపై కన్నేశారు. గత ఏడాది జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో రిసార్టు రాజకీయాలు నడిపి.. ప్రతి ఒక్కరికీ ఒక్కో రకం పెన్సిల్ ఇచ్చి మరీ ఓటింగ్ జరిపారు. వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందిన కార్పొరేటర్లకు పలు ఆశలు చూపి తమ పార్టీలో చేర్చుకున్నారు. అయితే పార్టీ మారే వరకూ ఎంతో గౌరవంగా పలకరించి.. స్టాండింగ్ కమిటీతో పాటు మేయర్ ఎన్నికల అనంతరం కనీసం పట్టించుకోవడం మానేశారంటూ పలువురు కార్పొరేటర్లు వాపోతున్నారు. తమకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. ఇక పార్టీ మారిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనిపై సమాధానం చెప్పాలంటూ కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. ఎక్కడ తమపై వేటు పడుతుందోనన్న ఆందోళనతో పార్టీ మారిన కార్పొరేటర్లు కొందరు వైఎస్సార్ సీపీకి ఓటు వేసినట్లు తెలుస్తోంది.

కూటమి పార్టీల్లో పెరిగిన అంతరం!

స్టాండింగ్ కమిటీ ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీల మధ్య లుకలుకలు బయటపడ్డాయి. ఈ ఎన్నికల్లో జనసేనకు కనీసం 2 స్థానాలైనా ఇవ్వాలని కోరగా ఒక్క స్థానం కూడా ఇవ్వలేదు. పోటీలో నిలిచిన కార్పొరేటర్ సాధిక్‌ను చివరిలో తప్పించారు. ఈ నేపథ్యంలో జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఏకంగా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. సీపీఎం కార్పొరేటర్ కూడా ఓటింగ్‌కు దూరంగా ఉంది. మరోవైపు టీడీపీ కూటమిలోని జనసేన, బీజేపీలను కలుపుకుని వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. కూటమిలోని లుకలుకలు కూడా ఈ ఫలితాలకు కారణమైనట్టు తెలుస్తోంది. అలాగే గత స్టాండింగ్ కమిటీ పేరుతో జరిపిన వసూళ్లలో జీవీఎంసీలో కీలక నేత పాత్రపైనా ఆరోపణలున్నాయి. స్టాండింగ్ కమిటీ పేరుతో నామినేషన్ పనుల్లో 10 శాతం వాటా అడిగి మరీ వసూలు చేయడంపై కాంట్రాక్టర్లల్లో వ్యతిరేకత ఉంది. వసూలు చేసిన మొత్తం కూడా కీలక నేతకు చేరిన తర్వాత పంపకాలు జరపడం... అదీ నామమాత్రంగా ఉండటం పట్ల కూడా గుర్రుగా ఉన్నారు. మొత్తంగా జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితం కూటమి పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు నిదర్శనంగా నిలుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎవరెవరికి ఎన్ని ఓట్లు వచ్చాయంటే..

డాబాగార్డెన్స్: స్థాయీ సంఘం ఎన్నికల్లో కొణతాల నీలిమకు అత్యధికంగా 58 ఓట్లు రాగా, గంకల కవితకు 57, దాడి వెంకట రామేశ్వరరావుకు 57, మొల్లి హేమలతకు 57, సేనాపతి వసంతకు 54, గేదెల లావణ్యకు 53, మాదంశెట్టి చిన్నతల్లికి 52, రాపర్తి త్రివేణి వరప్రసాదరావుకు 52, మొల్లి ముత్యాలు 51, సాడి పద్మావతి(పద్మారెడ్డి)కి 50 ఓట్లు పోలయ్యాయి.

వైఎస్సార్ సీపీకి లెక్కకు మించి..

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు లెక్కకు మించి ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీకి 32 మంది కార్పొరేటర్ల బలమే ఉన్నప్పటికీ.. కూటమి పార్టీలకు చెందిన పలువురు కార్పొరేటర్లు ఓట్లు వేశారు. సాడి పద్మారెడ్డికి 50, నెక్కల లక్ష్మికి 39, పల్లా అప్పలకొండకు 38, మహ్మద్ ఇమ్రాన్‌కు 38, కోడిగుడ్ల పూర్ణిమకు 38, రెయ్యి వెంకటరమణకు 37, గుండాపు నాగేశ్వరరావుకు 35, ఉరుకూటి రామచంద్రరావుకు 35, కేవీఎన్ శశికళకు 34, బిపిన్ కుమార్ జైన్‌కు 33 ఓట్లు పోలయ్యాయి.

పల్లాకే జెల్ల..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రతిపాదించిన గాజువాకకు చెందిన కూటమి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌కు కూటమి కార్పొరేటర్లు జెల్ల కొట్టారు. కూటమి పార్టీ నుంచి అత్యధికంగా బలం ఉన్నప్పటికీ ఆ కార్పొరేటర్లు ఎవరూ రౌతుపై మొగ్గు చూపలేదు. పల్లా శ్రీనివాసరావు ప్రతిపాదించిన వ్యక్తికే కూటమి కార్పొరేటర్లు ఓటు వేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో లుకలుకలకు స్థాయీ సంఘం ఎన్నిక శ్రీకారం చుట్టినట్టయిందని పలువురు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

పులివెందులలో టీడీపీ గూండాల దాడులు దుర్మార్గం

- ఓటమి భయంతోనే టీడీపీ శ్రేణుల రౌడీయిజం
- మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు విమర్శ



దేవరాపల్లి: కడప జిల్లా పులివెందుల మండలంలో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ గూండాలు మూకుమ్మడిగా దాడులు చేయడం దుర్మార్గమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ నల్లగొండువారి పల్లె గ్రామంలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెల్పుల రాము, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఇతర నాయకులపై టీడీపీ శ్రేణులు మూకుమ్మడిగా దాడులు చేసి వాహనాలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలవలేక ప్రజలను, వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ఇలా దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడటం సరికాదన్నారు.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

8లో



క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికుల జిల్లా కమిటీ ఎన్నిక



భవన నిర్మాణ కార్మికుల కమిటీ ప్రతినిధులు

రాంబిల్లి(అచ్యుతాపురం): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కె.రామకృష్ణ(నర్సీపట్నం) ఎన్నికయ్యారు. రాంబిల్లిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల మహాసభల్లో నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా అడిగర్ల రాజు, ఉపాధ్యక్షులుగా పి.చిరంజీవి(పరవాడ), డి.శివ(నర్సీపట్నం), సహాయ కార్యదర్శిగా అప్పలనాయుడు(సబ్బవరం), కోశాధికారిగా జి.అప్పారావుతో పాటు 9 మందితో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాడతామన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్లో ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ స్టాండ్

గోపాలపట్నం: ప్రయాణికుల భద్రత కోసం ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ స్టాండ్‌ను ప్రారంభిస్తున్నట్లు రైల్వే డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ప్రిపెయిడ్ ఆటో ట్యాక్సీ స్టాండ్‌ను బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. ఇక్కడి రైల్వే స్టేషన్‌లో 22 రైళ్లు ఆగుతున్నాయని, వాటిలో దిగే ప్రయాణికులు నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లేటపుడు భద్రత పరంగా భయపడనక్కర్లేకుండా ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఆటో ధరలు ఉంటాయన్నారు. ఇక్కడ ఈ స్టాండ్ ఏర్పాటుకు సహకరించిన దాతలకు గోపాలపట్నం సీఐ ఎన్‌వీ ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరణ



విద్యాశక్తి పథకాన్ని బహిష్కరిస్తున్నట్లు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాశక్తి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు బహిష్కరించారు. ఈ మేరకు స్థానిక డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ పార్వతికి లేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు, డిప్యూటీ కార్యదర్శి గొంది చిన్నబాయ్‌లు మాట్లాడుతూ విద్యాశక్తి కార్యక్రమం వల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రూపొందించిన పాఠాలు బోధిస్తుండగా అవే పాఠ్యాంశాలను సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ఆన్‌లైన్‌లో ప్రసారం చేయడం వల్ల సమయం వృథా తప్ప ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఆన్‌లైన్ ప్రసారంలో క్వాలిటీ లేకపోవడం, బోధన అంతా తెలుగు మీడియంలో జరగడం, కొన్ని ప్రాంతాల్లో కరెంట్ పోవడం వంటి సంఘటనలతో ఈ విద్యాశక్తి కార్యక్రమం సక్రమంగా సాగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిరికి దుర్గాప్రసాద్, ఆచంట రవి, వత్ససాయి శ్రీలక్ష్మి, సీహెచ్ నాగేశ్వరావు, డి.ఎస్. మల్లేశ్వరావు, కరుణ జ్యోతి పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

- చోడవరం మండలంలో రాత్రికి రాత్రే కొండలు కనుమరుగు
- పట్టించుకోని రెవెన్యూ, మైన్స్ అధికారులు



ముద్దుర్తి రెవెన్యూలో కొండను తవ్వేసిన దృశ్యం

చోడవరం: అక్రమ తవ్వకాలతో మండలంలో కొండలు పిండవుతున్నాయి. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఎవరికి తోచినంత వారు కొండలను యథేచ్ఛగా తవ్వేసుకుంటున్నారు. ముద్దుర్తి, నర్సాపురం, రాయపురాజుపేట, గోవాడ, అడ్డూరు, గంధవరం, బెన్నవోలు, ఖండిపల్లి, వెంకన్నపాలెం, ఎం.కొత్తపల్లి, దుడ్డుపాలెం గ్రామాల పరిధిలో ఉన్న కొండల్లో అక్రమ మెటల్ క్వారీలు నడుస్తున్నాయి. దోచుకున్న వారికి దోచుకున్నంతగా కొండలను కొల్లగొడుతున్నారు. వాస్తవానికి ఎర్రమెటల్ తవ్వకాలు, రవాణా చేయాలంటే ముందుగా రెవెన్యూ, మైన్స్ శాఖల అనుమతి పొందాల్సి ఉంది. చోడవరం మండలంలో మాత్రం అవేమీ లేవు. స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో తవ్వేసుకొని తరలించుకుపోతున్నారు. పొక్లెయిన్ల సాయంతో ఎక్కడికక్కడ కొండలను తవ్వేసి లారీలు, ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో ఎక్కువగా ఇక్కడ తవ్వకాలు జరుగుతున్నాయి. దీనికి స్థానిక అధికార పార్టీ నాయకుల సహకారం కూడా ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఈ దందా నడుస్తున్నట్టు తెలిసింది. గంధవరం, అడ్డూరు, ముద్దుర్తి, నర్సాపురం, వెంకన్నపాలెం గ్రామాల్లో రియల్టర్లు పక్కనే ఉన్న కొండల నుంచి ఎర్ర మెటల్, మట్టిని తవ్వేసి తమ భూములను ఎత్తుచేసి ప్లాట్లు వేసి అమ్ముతున్నారు.

ఇందుకు స్థానిక వీఆర్వోలు సహకారం అందిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్ శాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలంటూ మొక్కుబడిగా కమిటీలు వేసినా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఇలా అనుమతి లేకుండా కొండలను తవ్వేసుకోవడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రాక పోగా.. పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా మైన్స్, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- వంతెన రక్షణ గోడను ఢీకొన్న కంటైనర్
- 30 అడుగుల ఎత్తు నుంచి పడి డ్రైవర్ దుర్మరణం



దాదాపు 30 అడుగుల వంతెన పై నుంచి పడి మృతి చెందిన డ్రైవర్ రాకేష్‌కుమార్

పెందుర్తి : ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి–16(బైపాస్) పెందుర్తి సమీపంలోని సరిపల్లి వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి.. జాతీయ రహదారిపై సబ్బవరం వైపు నుంచి ఆనందపురం వైపు వెళుతున్న కంటైనర్ సరిపల్లి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పింది. ఈ క్రమంలో వంతెన రక్షణ గోడ వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో కంటైనర్ డోర్ తెరుచుకోవడంతో డ్రైవర్ రాకేష్‌కుమార్(40) దాదాపు 30 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి విచారణ చేపట్టారు. రాకేష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునిది ఉత్తరప్రదేశ్ రోషన్‌నగర్. అతని బంధువులకు సమాచారం అందించారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ రికార్డు సృష్టికర్త సుధాకర్ కన్నుమూత



పట్నాల జె.సుధాకర్

విశాఖ సిటీ : సీనియర్ జర్నలిస్ట్, 110 డిగ్రీలతో ప్రపంచ రికార్డు సృష్టించిన పట్నాల జె.సుధాకర్ బుధవారం విశాఖలో కన్నుమూశారు. 1957, డిసెంబర్ 1న జన్మించిన ఆయన డిగ్రీలు సాధించడంలో రికార్డు నెలకొల్పారు. మహారాష్ట్రకు చెందిన శ్రీకాంత్ జిచ్కర్ తర్వాత ఈ రికార్డును కలిగి ఉన్న ఏకైక వ్యక్తిగా సుధాకర్ గుర్తింపు పొందారు. ఆయన అనారోగ్యం కారణంగా బుధవారం మరణించారు. గురువారం నగరంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

ఫార్మసిస్టు వైద్యుడి అవతారం

- ప్రభుత్వం సరఫరా చేసిన మందులతో పెనుగొల్లు ఫార్మసిస్టు ప్రైవేటు ప్రాక్టీసు
- సాక్షి కథనంతో విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్
- అధికారుల ఆకస్మిక తనిఖీలు
- ఆస్పత్రిలో ప్రభుత్వం సరఫరా చేసిన మందుల గుర్తింపు



సుబ్బారావు నిర్వహిస్తున్న ఆస్పత్రిలో పట్టుబడిన ప్రభుత్వ సరఫరా ఔషధాలు



యలమంచిలిలో సుబ్బారావు నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రిలో అధికారుల తనిఖీలు

యలమంచిలి రూరల్ : పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న సుబ్బారావు యలమంచిలి పట్టణం శేషుగెడ్డ వద్ద నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఫార్మసిస్టు సుబ్బారావు ఇక్కడ ప్రైవేటుగా ఆస్పత్రి నిర్వహించడంతో పాటు రోగులకు వైద్యం అందిస్తున్నట్టు, ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న ఔషధాలను కూడా ఈ ఆస్పత్రిలో వైద్యం కోసం వినియోగిస్తున్నట్టు అధికారులు గుర్తించి విస్తుబోయారు. గత నెల 23న సాక్షిలో 'అర్హత లేని వైద్యులు..గాల్లో ప్రాణాలు' శీర్షికన జిల్లాలో అనుమతి లేని ఆస్పత్రులు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసిస్టులుగా పనిచేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వైద్యుల అవతారం ఎత్తి, అర్హత లేని వైద్యం చేస్తున్న వైనంపై కథనం ప్రచురితమైంది. యలమంచిలి మండలం జంపపాలెంకు చెందిన ఆర్టీఐ యాక్టివిస్టు చాకలి నూకరాజు పెనుగొల్లు ప్రభుత్వ ఫార్మసిస్టు సుబ్బారావు యలమంచిలిలో ప్రైవేటుగా ఆస్పత్రి నిర్వహిస్తున్న విషయంపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎం.హైమావతి ఇద్దరు అధికారులు, ఇద్దరు సిబ్బందితో విచారణ బృందాన్ని నియమించారు. ఆ బృందం బుధవారం రాత్రి యలమంచిలి వచ్చి ఫార్మసిస్టు సుబ్బారావు పట్టణంలో నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు తనిఖీకి వెళ్లిన సమయంలో ఫార్మసిస్టు సుబ్బారావు ఇద్దరు రోగులకు సెలైన్ ఎక్కిస్తున్నారు. ఆస్పత్రిలో మరొక గదిలో ప్రభుత్వం సరఫరా చేసిన ఔషధాలు పట్టుబడ్డాయి. వాటిలో మాత్రలు, ఇంజెక్షన్లు వంటివి ఉన్నాయి. వాటిని సీజ్ చేసిన అధికారులు ఫార్మసిస్టు సుబ్బారావు నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. తాను వైద్యం చేస్తున్నట్టు సుబ్బారావు రాతపూర్వకంగా వాంగ్మూలంలో అంగీకరించారు. దీనిపై నివేదికను డీఎంహెచ్‌వోకు అందజేస్తామని తనిఖీకి వచ్చిన అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు యలమంచిలిలో సంచలనం కలిగించాయి.

15 నుంచి కొత్త పాస్ పుస్తకాల పంపిణీ

- 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: భూసర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను ఈ నెల 15 నుంచి పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. అలాగే ఈ నెల 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పీజీఆర్ఎస్ అర్జీలు, అందరికీ ఇళ్లు, భూముల క్రమబద్ధీకరణ, భూసర్వే, కోర్టు కేసులు, అన్నదాత సుఖీభవ, రేషన్ పంపిణీ, మ్యుటేషన్లు, ఏపీ సేవా సర్వీసులు, నీటి తీరువా వసూళ్లు, ఇంటి స్థల దరఖాస్తుల పరిశీలన వంటి అంశాలపై జేసీ ఎం.జాహ్నవితో కలిసి రెవెన్యూ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను మంగళవారం తప్పక క్షేత్రస్థాయి పరిశీలన చేసి దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే ఇంటి స్థలం కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. వివాదం లేని ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్లను క్రమబద్ధీకరించాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ నిధులు జమ కాని అర్హులైన రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమం సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే సరకులు డీలర్లు అందించాలన్నారు. నీటి తీరువా వసూళ్లు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఏపీ సర్వీసులు, మ్యుటేషన్లు, సర్వే అంశాలకు సంబంధించిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్దిష్ట కాలంలో సర్వీసులను ప్రజలకు అందించాలన్నారు. జేసీ మాట్లాడుతూ భూసర్వే విభాగం అధికారులు లక్ష్యానికి అనుకూలంగా పేర్కొన్న అన్ని గ్రామాల్లో గ్రామ బౌండరీ ఫిక్సేషన్ పనులు ప్రారంభించాలన్నారు. తదుపరి సమావేశం నాటికి అన్ని రకాల రెవెన్యూ సేవలను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రొయ్యలు, చేపల ఉత్పత్తి పెంపునకు చర్యలు

జిల్లాలో రొయ్యలు, చేపల పెంపకాన్ని, ఉత్పత్తిని ప్రోత్సహించటకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేపల పెంపకంపై మత్స్యశాఖ, వ్యవసాయ, నీటి పారుదల, కాలుష్య నియంత్రణ మండలి శాఖలతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. రాంబిల్లి, ఎస్ రాయవరం, పాయకరావుపేట మండలాల్లో సుమారు 172.68 ఎకరాల నాన్–అక్వా జోనేషన్ భూమిని ఆక్వా జోనేషన్‌గా (చేపల పెంపకం ప్రాంతంగా) మార్చేందుకు ఈ కమిటీలో అనుమతి మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా కల్చర్ రంగ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా సప్లయి అధికారి కె.ఎల్.ఎన్.మూర్తి, జిల్లా సర్వే అధికారి గోపాలరాజు, ఎస్‌డీసీలు, జిల్లా మత్స్య శాఖ అధికారి జిల్లా జి.విజయ, ప్రగతిశీల మత్స్యకారుడు వి.గోపాల్‌కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ముకుందరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సింహగిరి నుంచి దాసుడు తిరుగు పయనం



తన పరివారంతో తిరుగు పయనమవుతున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: ఒడిశాకి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ బుధవారం సింహగిరిపై నుంచి తిరుగుపయనమయ్యారు. ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి విశేష సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత తరానికి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్ ఈ ఏడాది మే నెలలో సింహగిరికి వచ్చారు. సింహగిరిపై ఉన్న దాసుల ఆశ్రమంలో సుమారు మూడు నెలలపాటు ఉండి స్వామికి విశేష సేవలందించారు. నిత్యకల్యాణం, గరుడసేవ, ఊంజల్‌సేవ, కోలా సేవ, లక్ష తులసి పూజ తదితర సేవలను జరిపించారు. తిరిగి బుధవారం మధ్యాహ్నం సింహగిరి నుంచి తిరుగు పయనమయ్యారు. ఈవో కార్యాలయం వద్ద దేవస్థానం అధికారులు ఆయన్ని సత్కరించారు.

స్థల వివాదంలో కొట్లాట.. ఐదుగురికి గాయాలు

కూర్మన్నపాలెం: స్థల వివాదం కొట్లాటకు దారి తీయడంతో ఐదుగురు గాయపడ్డారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు.. పెదగంట్యాడ మండలం అప్పికొండలో రౌడీషీటర్ గరికిన గంగరాజు, ఆయన సోదరి చోడిపల్లి బంగారమ్మల మధ్య చాలా రోజుల నుంచి భూవివాదం ఉంది. దీనిపై ఇరువర్గాల వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదం నడుస్తుండగానే గంగరాజు సదరు స్థలాన్ని చదును చేసేందుకు పనులు ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న బంగారమ్మ.. భర్త వెంకటరావుతో కలిసి అక్కడికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈలోగా గంగరాజు భార్య, కుమారుడు అక్కడకు చేరుకున్నారు. ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడి చేసుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణలో గంగరాజు తలకు తీవ్ర గాయాలు కావడంతో కుట్లు పడ్డాయి. గంగరాజు సోదరి బంగారమ్మకు కూడా తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారిద్దరితోపాటు గంగరాజు భార్య, కొడుకు కోటేశ్వరరావు, బావ వెంకటరావు కూడా గాయపడ్డారు. గంగరాజు కుటుంబసభ్యులు అగనంపూడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన సోదరి, బావ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదన్నారు. ఇరు వర్గాలపై కేసు నమోదుచేసి సీఐ కె.మల్లేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు. గంగరాజుపై దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందని పోలీసులు తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లతో డీఎస్పీ శ్రావణి, ఎస్ఐ రవికుమార్

అనకాపల్లి టౌన్ : అక్రమంగా తరలిస్తున్న 107 కేజీల గంజాయి, 200 రూపాయలు నగదును స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ శ్రావణి తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు తెలిపారు. ముంచింగ్‌పుట్టు గ్రామానికి చెందిన బాలు(16) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. కిలగాడ గ్రామంలో నివాసముంటున్న గతంలో గంజాయి రవాణా చేసే ఒక వ్యక్తితో పరిచయం చేసుకొని గంజాయి రవాణా ద్వారా డబ్బు సంపాదించాలని భావించాడు. ఇందుకు తన స్నేహితుడు కిముడు నవదీప్ (16)ను కూడా కలుపుకొన్నాడు. ముగ్గురూ కలిసి ఒడిశాలోని కోడిగండి గ్రామం నుంచి గంజాయితో పాడేరు మీదుగా అనకాపల్లి బయలుదేరారు. మార్గమధ్యంలో అనకాపల్లి మండలంలోని కుంచంగి గ్రామం వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా, గమనించిన కిలగాడకు చెందిన వ్యక్తి ఆటో దిగి పారిపోయాడు. పోలీసులు ఆటోలో ఉన్న గంజాయితో పాటు ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించారు. పరారైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఎస్ఐ రవి కుమార్, సిబ్బందిని ఆమె అభినందించారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం



కోర్సు పోస్టర్‌ను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం : బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కోర్సుకి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని చెప్పారు. అదేవిధంగా నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం పలు ప్రతిపాదనలు సిద్ధం చేసి దరఖాస్తు చేశామని చెప్పారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కోర్సుకి అవసరమైన వ్యవస్థను నిర్మించే దిశగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలోకి వచ్చే సమయానికి క్వాంటమ్ రంగంలోని సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. విభిన్న విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశ్రమల నిపుణులు ప్రత్యక్షంగా పాల్గొని ఆచార్యులకు శిక్షణ అందిస్తారని తెలిపారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీ కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2025 జూలై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. https://ignouadmi ssion.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గతంలో ప్రకటించిన గడువు ఇటీవల ముగియడంతో ఆగస్టు 15 వరకు పొడిగించారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు

మద్దిలపాలెం: ఏయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డీఏ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ, ఎంపిక తేదీలను త్వరలో ఖరారు చేస్తామన్నారు. వివరాలకు ఏయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ జనచైతన్య సాయిభారతి లేఅవుట్ పెందుర్తి దగ్గర్లో చింతలపాలెం విలేజ్, కొత్తవలస మం॥ 220 Sq.yds 3 బిట్లు, 660 గజాలు అమ్మకం, డైరెక్ట్ పార్టీస్ మాత్రమే, గజం : 11,000/-. ఫోన్ : 98662 68791 [SCA25006985]

Wanted

■ Wanted Male Marketing Incharges and Computer Operators Qualification Any Degree. Age Limit: 25 to 45 years, Salary upto: 20000/- Working Location: Master Minds College, Vizag & Gajuwaka. Contact: 8008556073, 9248722267 [G-6125]

■ చెదల నివారణ కంపెనీలో పనిచేయుటకు బాయ్స్ కావలెను. వెహికల్ తప్పని సరి ,అర్హత :10th, జీతం:రూ 18,000/-, పెట్రోల్ చార్జి సపరేట్ .సంప్ర ✆ 94945 69895 [B-548]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

OLD AGE HOME

■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [SCA25006954]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

కెనరా బ్యాంక్ Canara Bank Syndicate

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695. ఇ-మెయిల్ : armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన క్రింద పేర్కొన్న బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్‌ల అధీకృత అధికారిచే లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది.08.09.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం : తేది.08.09.2025, మ॥02.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 08.09.2025, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 08.09.2025, మ॥ 12.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్నీ ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయడమైనవి)	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఏలూరు బ్రాంచ్, ఏలూరు మెస్సర్స్ ఈశ్వర్ సంకల్ప్ డెవలపర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్ట్‌నర్ : శ్రీ అరిమండ దుర్గా రామకృష్ణారెడ్డి, తండ్రి : అరిమండ కనక రెడ్డి & లేటు శ్రీమతి అరిమండ కళ్యాణి, భర్త: అరిమండ దుర్గా రామకృష్ణారెడ్డి బకాయి మొత్తం : రూ.18,29,94,801.74 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు ఏరియా షెడ్యూలు: తూర్పుగోదావరి జిల్లా, పిడింగొయ్య జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ఏరియా రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, రాజమండ్రి రూరల్ ఏరియా, పిడింగొయ్య గ్రామ పంచాయితీ, ఐ.ఎల్.పురం ఎస్.నెం.308 మరియు రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, వి.ఎల్.పురం ఎస్.నెం.306/1 లోని మొత్తం 10288.55 చ॥గ॥ల విస్తీర్ణంలో 5967.86 చ॥గ॥ల బిల్డర్/డెవలపర్ వాటా లోని 3200 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో గల "ఈశ్వర్ సంకల్ప్ హోమ్స్" నందు 69 ఫ్లాట్స్ (అసంపూరిత ఫ్లాట్స్)తో సి.డి.ఇ.ఎఫ్ & ఎమెనిటీస్ బ్లాక్స్ లోని కామన్ ఏరియాలు మరియు బాల్కానీలతో కలిపి 89045 చ॥అ॥ల సూపర్ బిల్టప్ ఏరియాతో మరియు సి.డి.ఇ.ఎఫ్ & ఎమెనిటీస్ బ్లాక్స్ లోని స్టిల్ట్ ఫ్లోర్ నందు 5520 చ॥అ॥ల కార్ పార్కింగ్ (69 ఫ్లాట్స్‌కు ఒక్కో ఫ్లాట్‌కు 80 చ॥అ॥ల చొప్పున కార్ పార్కింగ్) విస్తీర్ణంతో గల యావత్తు ఆస్తి. హద్దులు: డీడ్ ప్రకారం. "ఎ,బి,సి,డి,ఇ,ఎఫ్ మరియు ఎమెనిటీస్ బ్లాక్స్" లోని బిల్డర్ వాటాలోని మొత్తం 110 ఫ్లాట్లలో, సి.డి.ఇ.ఎఫ్ మరియు ఎమెనిటీస్ బ్లాక్స్‌లోని 69 ఫ్లాట్లు బ్యాంకుకు తనఖా పెట్టబడ్డాయి. బ్లాక్-సి లో: క్రింది అంతస్తు నందు ఫ్లాట్ నెం.101,102,103,104,106, మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం. 201, 202, 203, 204, 206, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.501, 502, 503, 504, 505, 506. బ్లాక్-డి లో: మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.201,203,204,206, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 401, 402, 403, 404, 405, 406. బ్లాక్-ఇ లో: క్రింది అంతస్తు నందు ఫ్లాట్ నెం.101,102,103,104,105,106, మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.202, 205, రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.301,306, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.401, 402, 403, 404, 405,406, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.501, 502, 503, 504, 505, 506. బ్లాక్-ఎఫ్ లో: మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.201,202,203,204,206, రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.301,303,304,306, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.401,402,403,404,405,406, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.503. ఎమెనిటీస్ బ్లాక్ లో: క్రింది అంతస్తు నందు ఫ్లాట్ నెం.102, మొదటి అంతస్తు నందు ఫ్లాట్ నెం.201, రెండవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.302, మూడవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.401, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.502.	రూ. 18.43 కోట్లు	రూ. 1.84 కోట్లు

ఆస్తి తనిఖీ తేది & సమయం : తేది.06.09.2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8331011695.

బ్యాంకుకు తెలిసిన / తెలియని బకాయిలు / ట్యాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతో పాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 500.00 లక్షల వరకు ఉన్న వాటికి రూ.5,00,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనలు కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ : "https://baanknet.com/eauction-psb". హెల్ప్ డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848/8160205051. ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది : 01-08-2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

దేవదాయశాఖ భూముల పరిశీలన

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో గల దేవదాయ శాఖకు చెందిన పంట భూములను బుధవారం ఆ శాఖ అనకాపల్లి అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి పరిశీలించారు. వీటి కౌలు నిర్ణయించడానికి ఇటీవల వేలం పాట నిర్వహించేందుకు ప్రయత్నించారు. ఎక్కువ మంది రైతులు పాల్గొనకపోవడంతో వాయిదా వేశారు. దీంతో కొందరు అభ్యంతరం తెలిపిన నేపథ్యంలో ఆ భూములను పరిశీలించారు.ఆమె వెంట ఈవో సత్యనారాయణమూర్తి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీనియర్ సిటిజన్స్ సావనీర్‌ను విడుదల చేస్తున్న ఆర్డీవో షేక్ ఆయిషా

అనకాపల్లి టౌన్: సీనియర్ సిటిజన్ల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్వదినియోగం చేసుకోవాలని ఆర్డీవో షేక్ ఆయిషా తెలిపారు. స్థానిక జార్జ్‌క్లబ్ ఆవరణలో బుధవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీపతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ తరచూ కలవడం వల్ల వారిలో ఒంటరి తనం పోయి, జీవన ప్రమాణాలు మెరుగుపడాయని చెప్పారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలతో రూపొందించిన సావనీర్‌ను విడుదల చేశారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మూర్తి, హెల్ప్ ఏజ్ ఇండియా రాష్ట్ర కో–ఆర్డినేటర్ శ్యామ్, మహారాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల చోరీపై కేసు నమోదు

కశింకోట: మండలంలోని రెండు గ్రామాల్లో జరిగిన విద్యుత్ వైర్ల దొంగతనాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి. మనోజ్‌కుమార్ బుధవారం తెలిపారు. కశింకోట గ్రామ శివారులో ఓ రైతు నీరు తోడుకోవడానికి ఏర్పాటు చేసిన మోటారు విద్యుత్ కనెక్షన్ వైరును ఈ నెల 4వ తేదీన, ఏఎస్ పేటలో ఈ నెల 31న మరో రైతుకు చెందిన విద్యుత్ వైర్లను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ విషయమై బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వామపక్ష నాయకుల అరెస్టులు అన్యాయం

అనకాపల్లి: ప్రజలు పక్షాన పోరాటాలు చేస్తున్న వామపక్షాల నాయకులను అరెస్టులను చేయడం అన్యాయమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కపల్లి మండలంలో తలపెట్టనున్న బల్క్‌డ్రగ్ పార్కుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురుచేస్తోందని పేర్కొన్నారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 96 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,800	4,700
రెండో రకం	3,450	4,300
మూడవ రకం	3,000	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: జూనియర్
పర్తిసాయి	: మహావతార్ నరసింహ
వెంకటేశ్వర	: లోపలకి రా చెప్పతా..
శ్రీ సత్య	: తమ్ముడు
రామచంద్ర	: హరిహర వీరమల్లు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 328 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్ 08924–223595)ని సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-6, బి పాజిటివ్-19, ఒ పాజిటివ్-29, ఏబీ పాజిటివ్-5 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(ఫోన్ నంబర్ 9703613706)ను సంప్రదించవచ్చు.

ఆటోవాలా.. బతికేదెలా?



ప్రభుత్వ నిర్ణయం **వారికి శరాఘాతంగా** మారనుంది.. **ఆర్టీసీ బస్సుల్లో మహిళ**లకు ఉచిత ప్రయాణ **పథకం వారి జీవి**తాలను దారుణంగా **దెబ్బతీయనుంది..** తెలంగాణాలో **ఉచిత బస్సు పథకం వల్ల** బతుకులు అగమ్య**గోచరంగా మారి** పలువురు ఆటో **డ్రైవర్లు ఆత్మహత్యలు** చేసుకున్నారు.. **మన రాష్ట్రంలో కూడా** అమలు చేయను**ండడంతో తమ పరిస్థితి** ఏంటని పలువురు **ఆటోవాలాలు, వారి కుటుంబ సభ్యులు** ఆందోళన చెందు**తున్నారు.**

- ఉచిత బస్సు ప్రయాణంతో అగమ్యగోచరంగా ఆటో డ్రైవర్ల పరిస్థితి
- రోడ్డున పడనున్న జీవితాలు
- ఆందోళన చెందుతున్న కార్మికులు

కశింకోట: రాష్ట్రంలోని **కూటమి ప్రభుత్వం మహిళ**లకు ఉచిత బస్సు **ప్రయాణ సౌకర్యం కల్పించేం**దుకు సన్నాహాలు చేస్తుండటంతో ఆటో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల తమ ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆవేదన చెందుతున్నారు. తాము నష్టపోకుండా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుకుంటున్నారు. లేదంటే తమ కుటుంబాలు వీధిన పడతాయంటున్నారు. ఆర్థికసాయంపై ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం వారికి ప్రాణ సంకటంగా తయారైంది.

అనకాపల్లి నియోజకర్గంలోని అనకాపల్లి పట్టణంలో వెయ్యి, రూరల్ మండలంలో ఎనిమిది వందలు, కశింకోట మండలంలో సుమారు 500 ఆటోలున్నాయి. అనకాపల్లి మండలంలో పలు గ్రామాల్లో, కశింకోట, తాళ్లపాలెం, నరసింగబిల్లి,కొత్తపల్లి, తేగాడ, కన్నూరుపాలెం తదితర ప్రాంతాల్లో ఆటో స్టాండ్‌లున్నాయి. ఆటో నిర్వాహకుల్లో యజమానులు, అద్దెకు నడుపుతున్నవారు ఉన్నారు. వారు రోజూ ఆటో నడిపితేగాని కుటుంబాలు గడవని పరిస్థితి. ఆయిల్, ఇతర ఖర్చులు పోనూ రోజుకు రూ.500 కూడా మిగలడం లేదు. ఈ సొమ్ముతో కుటుంబాలను అతి కష్టం మీద నెట్టుకు రావలసి వస్తోంది. ఇప్పుడు మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అందుకు అధికారులను సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపింది. దీంతో ఆటో కార్మికులు ఒక్కసారిగా దిగాలు పడ్డారు. ఇలా అయితే తమ కుటుంబాలను ఎలా పోషించాలని ఆందోళన చెందుతున్నారు



తాళ్లపాలెం కూడలిలో ప్రయాణికుల కోసం ఆటోలతో నిరీక్షిస్తున్న డ్రైవర్లు



బేరాలు లేక స్టాండ్‌లో ఉన్న ఆటోలు

ఆటో ప్రయాణికుల్లో మహిళలే అధికం

ఆటోవాలాలకు ఆదాయం తెచ్చిపెట్టేది మహిళలే. పురుషులతో పోలిస్తే మహిళలే అధికంగా సుమారు 80 శాతం మంది ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా మహిళలు ఆటోలవైపు చూడడం మానేస్తారని, ఆదాయం గణనీయంగా పడిపోతుందని డ్రైవర్లు వాపోతున్నారు. ఇప్పటికే బేరాలు లేక సతమతమవుతున్నామని, ఇక ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఆటోలు నడిపే పరిస్థితి ఉండదంటున్నారు.

గత ప్రభుత్వంలో రూ.10 వేలు సాయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించేవారు. కూటమి ప్రభుత్వం అది కూడా ఇవ్వడం లేదు. దీనికి తోడు కేసులు అధికంగా రాస్తుండడతో ఆర్థికంగా చితికిపోతున్నారు. జీవో నంబర్లు 20,21 రద్దు చేయడంతో తమ సమస్యలు పరిష్కరించాలని ఆటో కార్మికులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం చేయాలి



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడానికి వ్యతిరేకం కాదు. అయితే దీనివల్ల ప్రయాణికులు లేకపోతే ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతాం. ఆటో కార్మికులకు తగిన ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని రెట్టింపు చేసి, మంజూరు చేయాలి.

– గుమ్మడి నారాయణరావు, ఆటో కార్మికుడు, తాళ్లపాలెం

ఆటో కార్మికులను ఆదుకోవాలి



ఆటో నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఆయిల్, ఇతర ఖర్చులు పోగా రోజుకి రూ.400 కూడా మిగలడం లేదు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఇక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే మరింత నష్టపోవలసి ఉంటుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి, తమను ఆదుకోవాలి.

– పుర్రె నరసింగరావు, ఆటో డ్రైవర్, తాళ్లపాలెం

జీవో నంబర్లు 20,21 రద్దు చేయాలి



ఆటో కార్మికుల జేబులకు చిల్లులు పెడుతున్న జీవో నంబర్లు 20,21లను రద్దు చేయాలి. జరిమానా రుసుం తగ్గించి, ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలి.

– గొలగాని రాజు, ఆటో డ్రైవర్, బంగారయ్యపేట

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

అనకాపల్లి టౌన్: పట్టణంలోని భాష్యం పాఠశాల విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆర్.ఆర్.కుమార స్వామి మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



కాపుశెట్టివానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తుమ్మపాల: పుట్టిన గంటలోపు తల్లి పాలు పట్టడం ద్వారా బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి తెలిపారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మండలంలో రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరు నెలలు పూర్తయిన బిడ్డలకు అన్నప్రాశన, ఆరుగురు గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సన్యాసమ్మ, వైస్ సర్పంచ్ కాపుశెట్టి రామకృష్ణ, బ్యాంక్ మిత్ర కోన నాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

83వ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలి



జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

అనకాపల్లి: స్థానిక 83వ వార్డులో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి,రమేష్ దంపతులు బుధవారం విశాఖ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్నలక్ష్మిమాట్లాడుతూ వార్డు పరిధిలో ఏఎంసీ కాలనీలో సామాజిక భవనం, కాలనీ నుంచి లక్ష్మీదేవిపేట ఎల్లయ్య కాలువపై కాలినడక వంతెన నిర్మించాలని, 3,4,6 వార్డు సచివాలయాల మేడపైన అదనంగా భవనాన్ని నిర్మించి, అక్కడ ప్రజలు వివాహాలు, శుభకార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని కోరినట్టు తెలిపారు. మిరియాల కాలనీ 4వ వీధి, వేల్పులవీధి శివాలయం వెనుక రహదారి, రాఘవేంద్రస్వామి ఆలయ రహదారి, మల్లిమనుగులవారి వీధి రహదారులు పాడైపోయాయని, ఆయా ప్రాంతాల్లో కొత్తగా రోడ్లు నిర్మించాలని కోరినట్టు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం

అనకాపల్లి టౌన్: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని దిబ్బపాలెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటి కషాయాలు వాడడం వల్ల పురుగులు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే పంటలు తినడం వల్ల కేన్సర్ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఏటీఎంపీ రామకృష్ణ, అప్పలరాజు, విల్లూరి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, చెరువు కాలువ సంఘ రైతులు

మునగపాక: మునగపాకలో పేరొందిన చెరువు కాలువ సంఘ పరిధిలోని సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. వేద పండితుడు నాని పంతుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మారిశెట్టి వెంకటప్పారావు, ఆడారి కాశీబాబు తదితరులు పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. చెరువు కాలువ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాడి చంద్రరావు, వెలగా అప్పలనాయుడు, సంఘ రైతులు కర్రి రామ జోగినాయుడు, ఆడారి జగ్గారావు, బొడ్డేడ రామునాయుడు, వెలగా వెంకటప్పారావు, వెలగా శ్రీనివాసరావు, బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా ధర్మసూరి అప్పారావు, సూరిబాబు, బొడ్డేడ రామారావు, దాడి అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



పెదఉప్పలంలోని పొలంలో సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు



ఎస్.నర్సాపురంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఎస్.రాయవరం: రైతుల విధిగా పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని యలమంచిలి కొక్కిరాపల్లి పరిశోధన సహాయ సంచాలకురాలు శిరీష సూచించారు. పెదఉప్పలం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో సౌజన్య, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు అవసరం

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పిలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వరి నారుమడిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ రైతులకు అవగాహన కల్పించారు. కొబ్బరి, తమలపాకు తోటలను సందర్శించి చీడపీడలు, సమగ్ర సస్య రక్షణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపి, ఏఈవో నాగమణి, ఎంపీఈవో శరత్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోసగించడంలో చంద్రబాబుది మొదటి స్థానం



దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్



బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు మోసాలను ఇంటింటా తెలియజేస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు నాయుడు మొదటి స్థానంలో ఉన్నారని, సూపర్ సిక్స్ పథకాలకు ఆశపడి కూటమికి ఓటు వేసి మోసపోయామని ప్రజలు తెలుసుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, మాజీ కౌన్సిలర్ దాడి నారాయణరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ ఇంటింట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా స్థానిక 81వ వార్డు అగ్గిమర్రిచెట్టు వద్ద దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 నగదు చెల్లిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ఆ హామీని అమలు చేయకుండా మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల అవకాశాలు కల్పించడం లేదని, నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో నేటికీ ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయని చెప్పారు. బుధవారం జరిగిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ గెలుపొందడమే దీనికి నిదర్శనమన్నారు. కరోనా సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినప్పటికీ నవరత్నాలు పథకాలను నిరాటంకంగా అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.ఈ సందర్భంగా రైతు ఆడారి బుచ్చిరాజు రాము మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయలేకపోయిందని చెప్పారు. ప్రభుత్వం అందజేసిన విత్తనాలు 50 శాతం మాత్రమే మొలకెత్తాయని తెలిపారు. అంతకుముందు బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు మహిళలు హారతులు ఇచ్చి, ఆహ్వానించారు. ఈ సందర్భంగా భోగలింగేశ్వరస్వామిని భరత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామ రాజు, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల వెంకట సాంబ శివ, పెతకంశెట్టి గోపి, సుంకర వెంకటేశ్వరరావు, కొణతాల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. ఇన్‌చార్జ్ హెచ్ఎం సుకుమార్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, కబడ్డీ, క్రికెట్, ఖోఖో పోటీలను పీడీ మట్ల గణేష్ పర్యవేక్షణలో నిర్వహించారు. సుకుమార్ మాట్లాడుతూ విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు. పీఈటీ బాబు, ఉపాధ్యాయులు కృష్ణ, బి.ఎస్.ప్రసాద్, రాజీవ్, కల్యాణ్, లావణ్య, కిషోర్, బ్రహ్మతేజ్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల నిరసన



తాళ్లపాలెం పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తల

కశింకోట: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, టీఏ,డీఏ ఇవ్వాలని, ఆస్పత్రులకు రోగులను తీసుకెళ్లేటప్పుడు అయ్యే ప్రయాణ ఖర్చులు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. రిటైర్‌మెంట్ సదుపాయాలు, అర్హులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, యూనియన్ నాయకులు అమ్మాజీ, కుమారి, పద్మ, రమణమ్మ, లక్ష్మి, శ్యామల, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాకలో భవనాల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. రహదారి విస్తరణలో కట్టడాలు కోల్పోతు న్న వారికి ప్రభుత్వం టీడీఆర్ రూపంలో చెక్కులు అందజేసింది. దీనిలో భాగంగా మెయిన్ రోడ్డులోని భవనాలను పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్నారు. నిర్వాసితులు స్వచ్ఛందంగా భవనాలను తొలగించేందుకు అంగీకరించి, ముందుకు రావడంతో రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది.

బల్క్ డ్రగ్ పార్కు వద్దంటూ గుర్రాజుపేటలో నిరసన



గుర్రాజుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: నక్కపల్లి,ఎస్.రాయవరం మండలాలగ్రామసరిహద్దులో ఏర్పాటు కాబోతున్న బల్క్‌డ్రగ్‌పార్కు వద్దంటూ గుర్రాజుపేటగ్రామస్తులు ఆందోళన చేశారు. నర్సీపట్నం ఆర్డీవో సమక్షంలో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లి నిరసన వ్యక్తం చేశారు. మా జీవితాలు, పిల్లలు భవిషత్ నాశనం చేసే కంపెనీలు మాకొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు శివరాజు, రామరాజు, చంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com